క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

దండేపల్లి: లేబర్ కార్డు కలిగి ఉండి 18నుంచి 45సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్(ఎన్‌ఏసీ)ఆధ్వర్యంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ సహకారంతో పలు వృత్తి నైపుణ్యత కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ శిక్షకులు సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. దండేపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహించే 15రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఎలక్ట్రిషన్, ప్లంబర్, పెయింటర్, మేషన్(సుతారి)పనుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.300చొప్పున ఖాతాలో జమచేయనున్నట్లు, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు లేబర్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్సులతో పాటు రెండు ఫొటోలతో, దండేపల్లిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9966110045 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అడవుల సంరక్షణ, మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి, సర్పంచ్ దూట జ్యోతి, ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, ప్లాంటేషన్ మేనేజర్లు, రేంజర్లు సురేశ్, లక్ష్మణ్, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో మంగళవారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమాతో పాటు ఇతర పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి, ఉపాధి పొందుతున్న లబ్ధిదారుల మనోభావాలను అధికారులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేడి రవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన మండలవాసులు

జన్నారం: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు, జన్నారం మండల వాసి గవ్వల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువ, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గ, జన్నారం మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు శ్రీకాంత్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ నుంచి కోటపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు పాఠశాల వేళల్లో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం ఆర్టీసీ కంట్రోలర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కోటపల్లి మోడల్ పాఠశాలకు చెన్నూర్ నుంచి 60నుంచి 70మంది విద్యార్థులు వెళ్తున్నారని, మహిళలకు ఫ్రీ బస్సు కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరో రెండు నెలల్లో పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ప్రత్యే క బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్ అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు చకినారపు రాజేశ్, తుమ్మ రాజలింగు, ప్రశాంత్, సంతోశ్, భీమయ్య, రాకేశ్, లక్ష్మణ్, వినయ్, రాజేశ్ పాల్గొన్నారు.

పేరుకే ‘వంద పడకలు’

- అప్‌గ్రేడ్ అయినా మెరుగుపడని సేవలు
- ప్రతిపాదనలకే పరిమితమైన పోస్టుల భర్తీ
- రోగులకు తప్పని అవస్థలు
- ఇది బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి దుస్థితి



బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

బెల్లంపల్లి: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందినప్పటికీ రోగుల వెతలు తీరడం లేదు. 30పడకల నుంచి 100పడకల సామర్థ్యానికి చేరుకున్న మార్పేమీ లేక పోగా అంతకంతకు సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్ కాగితాలకే పరిమితమైందనే విమర్శలు వస్తుండగా, పాత సమస్యలకు తోడు కొత్తగా మరిన్ని సమస్యలు జత కలవడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పెరిగిన పడకల సామర్థ్యానికి అనుగుణంగా వైద్యుల, సిబ్బంది పోస్టుల భర్తీ జరగడం లేదు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి దిన దినం పెరుగుతున్నా, అందుకు సరిపడా మందుల ప్రొవిజన్స్‌ను పెంచకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రంగా అందుతుండగా విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది అదనపు భారం మోయాల్సి వస్తోంది. పేరుకే ఏరియా ఆసుపత్రి తప్పా, మెరుగైన వైద్యం అందించే పరిస్థితిలో లేకపోవడం రోగులకు శాపంగా మారింది.

30పడకల ప్రొవిజన్సే దిక్కు ...

కాగితాల్లో అప్‌గ్రేడ్ అయిన ఏరియా ఆసుపత్రికి కొత్తగా మందుల ప్రొవిజన్స్ అలాట్‌మెంట్ చేయడం లేదు. ఒక మాత్ర కూడా అదనంగా పంపించడం లేదంటున్నారు. ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యాక ఆధునికంగా భవనాన్ని నిర్మించి కేవలం బెడ్స్ మాత్రమే సరఫరా చేశారు తప్పా, అంతకు మించిన పురోగతి లేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రికి రోజువారీగా 250నుంచి 300 మంది వరకు అవుట్ పేషంట్స్ వస్తుండగా, గరిష్ఠంగా 30పడకల వరకు సాధారణ రోగులు ఇన్‌పేషంట్స్‌గా ఆసుపత్రిలో చేరుతున్నారు. వీరికి అదనంగా మరో 25మంది వరకు గర్భిణులు ప్రసవం కోసం అడ్మిట్ అవుతున్నారు. అంత భారీగా రోగుల తాకిడి ఉన్న ఏరియా ఆసుపత్రిలో సరిపడినన్ని మందుల ప్రొవిజన్స్‌ను పెంచాల్సి ఉన్నా సోయి లేకుండా వ్యవహరిస్తుండటంతో రోగులకు అత్తెసరు మందులే అందుతున్నాయి. చేసేదేమీ లేకపోవడంతో అయిపోయే వరకు మందులు అందజేసి చేతులు ఎత్తాల్సిన ప్రతికూల పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడానికి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం శ్రద్ధతో చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

పోస్టులు భర్తీ చేయలేదు...

దశాబ్దాల నుంచి ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆధీనంలో నిర్వహిస్తున్న బెల్లంపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. ఆసుపత్రి సామర్థ్యం 30పడకల నుంచి 100కు చేరుకోగా అంతకుమించిన ప్రగతి ఏమీ లేకుండా పోయింది. పడకలు పెరిగిన తర్వాత రోగుల అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బందిని కొత్తగా నియమించాల్సి ఉండగా ఇంతవరకు భర్తీ చేయలేదు. దాదాపు 69పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు చేయగా వీటిలో ఏ ఒక్కరిని నియమించకపోవడం విస్మయం కలిగిస్తోంది. 30పడకలు ఉన్నప్పుడు ఉన్న వైద్యులు, సిబ్బంది మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అన్నీ కలిపి పాత పోస్టులు 50ఉండగా వీటిలో 6గురు రెగ్యులర్ వైద్యులు, మరో ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు పని చేస్తున్నారు. సిబ్బంది పోస్టులు పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్నా, ఏళ్ల తరబడి నుంచి భర్తీ చేయకుండా నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఏరియా ఆసుపత్రి పరిస్థితి పేరు గొప్పా, ఊరు దిబ్బ అన్న చందంగా తయారైందనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితమైన పోస్టుల వివరాలు..

సివిల్ సర్జన్ స్పెషలిస్టులు	- 8
సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ	- 1
డెప్యూటీ సివిల్ సర్జన్	- 3
డెప్యూటీ డెంటల్ సర్జన్	- 1
సివిల్ అసిస్టెంట్ సర్జన్స్	- 13
నర్సింగ్ సూపరింటెండెంట్-గ్రేడ్-1	- 1
నర్సింగ్ సూపరింటెండెంట్-గ్రేడ్2	- 1
ఫిజియోథెరపిస్ట్	- 1
హెడ్ నర్స్	- 3
అడ్మినిస్ట్రేటివ్ అధికారి	- 1
హెల్త్ ఇన్‌స్పెక్టర్	- 1
రిఫ్రాక్షనిస్ట్	- 1
జూనియర్‌అనలిస్ట్	- 1
ఫార్మాసిస్ట్ గ్రేడ్-1	- 1
ఆఫీస్ సూపరింటెండెంట్	- 1
సీనియర్ అసిస్టెంట్	- 2
స్టాఫ్ నర్స్	- 16
ల్యాబ్ టెక్నీషియన్	- 3
రేడియో గ్రాఫర్	- 1
డార్క్ రూమ్ అసిస్టెంట్	- 1
ఆప్తాల్మిక్ అసిస్టెంట్	- 1
ఏఎన్‌ఎం	- 2
ఫార్మాసిస్ట్ గ్రేడ్-2	- 2
థియేటర్ అసిస్టెంట్	- 2
జూనియర్ అసిస్టెంట్స్	- 1

మొరం పోశారు..!



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట నుంచి చింతపల్లి వరకు కొత్తగా బీటీ, సీసీ రోడ్డు వేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా సమానంగా మొరం పోయకపోవడంతో, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ‘రోడ్డు వేశారు.. మొరం మరిచారు’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా సమానంగా మొరం పోయించి లెవల్ చేశారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని వినతి

భీమారం: స్థానిక బస్టాండ్ వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు హైదరాబాద్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు వివిధ అవసరాల రిత్యా భీమారం వస్తుంటారని వారు పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంతంలో కనీసం మూత్రశాలలు లేక మహిళలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకొని సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పాటుపడాలని వారు కోరారు.

పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో 183మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని చింతగూడ రోడ్డు, సింగరాయి పేట రోడ్డు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. టైగర్‌జోన్ పేరిట వరి ధాన్యం తరలించే వాహనాలకు రూ.500 వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందన్నారు. అటవీ అధికారులు డబ్బులు వసూలు ఆపాలని, ఈ విషయంలో ఏదైనా ప్రభుత్వం జీవో ఉంటే తనకు చూపిస్తే మాట్లాడుతానన్నారు. పార్టీ ఏదైనా ప్రజల సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. పార్టీలను పక్కన పెట్టి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీటీసీలు రియాజొద్దీన్, మమత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్, శంకరయ్య, కరుణాకర్, ఇందయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



చింతగూడలో డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న డీపీవో

జన్నారం: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రతిరోజు ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని చింతగూడలో మంగళవారం పర్యటించి పలు వార్డులను పరిశీలించారు. డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామాల్లో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి శుక్రవారం గ్రీన్ డే సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని మొక్కలకు నీరు పోయాలని సూచించారు. గ్రామ నర్సరీ నిర్వహణ పరిశీలించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎంపీవో రమేశ్, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

కూరగాయల మార్కెట్లో ఎమ్మెల్యే పర్యటన

- వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్న ప్రేమ్‌సాగర్‌రావ్



వ్యాపారులను పలకరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావ్ మొదటి సారి మంగళవారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో పర్యటిస్తూ కూరగాయల వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో నిర్మించిన భవనం ఖాళీగా ఉండడంతో వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం కూరగాయల వ్యాపారులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 15మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారాక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అంజలిరెడ్డి, ఆర్‌ఐ అజీజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓస్ ఆధ్వర్యంలో సన్మానం..

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్‌ను టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీ సంఘం అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ హబీబ్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడు సైండ్ల మొండయ్య, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, రాంబట్ల రమేశ్, శాంతయ్య, పాండు రంగం, సర్దార్ ఆహ్మద్,త రాజేశ్వర్‌రావ్, అంజలీన, వాసుమతి, కళావతి, లత, అండాలు, సంపత్, రాజమౌళి, సుదర్శనం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగులు, అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల పంచాయతీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. త్వరలోనే ఉద్యోగ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపు, ప్రధాన కార్యదర్శి ఎం.డీ.అజ్మత్‌అలీ, కోశాధికారి షేక్ సఫ్దర్ అలీ, సభ్యులు వేదాల శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం..

తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం ఆధ్వర్యంలోనూ ఎమ్మెల్యేను ఫోరం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అటవీ ఉద్యోగుల సమస్యలు అటవీ మంత్రి సురేఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, ఉపాధ్యక్షుడు రవికిరణ్‌రెడ్డి, కాళేశ్వరం సర్కిల్ కార్యదర్శి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

బెటాలియన్ ఆధ్వర్యంలో..

హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్‌ఐలు కుమారస్వామి, రవి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, నాయకులు ఒడ్డె శ్రీనివాస్, రాసమల్ల శ్రీనివాసగౌడ్, ఒడ్డె రాజమౌళి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమాండెంట్ జమీల్‌భాష, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సంజీవరెడ్డి


శ్రీరాంపూర్: ఈ నెల 23న ప్రగతి మైదానంలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. వేడుకలు జరిగే ప్రగతి మైదానాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. మైదానంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే వారికి కావాల్సిన తాగునీరు ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మైదానం చుట్టూ లైట్లు అమర్చాలన్నారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను డిపార్టుమెంట్ల అధికారులు జీఎంకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటుజీఎం రఘు కుమార్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, వర్క్‌షాప్ ఎస్ఈ మల్లయ్య, సివిల్ ఎస్ఈ రాము, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చీటీల పంపిణీ

శ్రీరాంపూర్: ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2022, మార్చికి సంబంధించిన సీఎంపీఎఫ్ చీటీలను జీఎం సంజీవరెడ్డి అందజేశారు. వివరాల్లో ఏమన్నా సందేహాలు ఉంటే డిపార్టుమెంట్ల అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం కే రఘుకుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవింద్ రావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘గెలిచి హక్కులు పోగొట్టారు’

- హెచ్‌ఎంఎస్ నాయకులు



మాట్లాడుతున్న అనిల్‌రెడ్డి

శ్రీరాంపూర్: ఇప్పటివరకు గెలిచిన మూడు కార్మిక సంఘాల నేతలే కార్మికుల హక్కులను పోగొట్టారని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈ 25 సంవత్సరాల నుంచి అధికారం చలాయించి సంస్థను సర్వనాశనం చేశారన్నారు. వారికి ఓటు అడిగే హక్కు లేదని ఆరోపించారు. కార్మికుల పక్షాన పోరాడుతున్న హెచ్‌ఎంఎస్‌ను ఆదరించి గెలిపిస్తే, కార్మికులకు కొత్త హక్కులు, సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి గొల్ల సత్తన్న, నాయకులు కృష్ణారెడ్డి, దేవి సత్యం, దుర్గం వెంకటేశ్వర్లు, నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

‘ఎన్నికలు కొనసాగించాలి’



మాట్లాడుతున్న మల్రాజ్ శ్రీనివాస రావు

తాండూర్: సింగరేణిలో నిర్వహించే యూనియన్ ఎన్నికలను యధావిధిగా ఈ నెల 27న నిర్వహించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్ డిస్పెన్సరీ, సివిల్ డిపార్ట్‌మెంట్‌ల వద్ద మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ టీబీజీకేఎస్ కే కార్మికులు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ ప్రకాష్‌రావు, చర్చల కమిటీ ప్రతినిధి మంగీలాల్, నాయకులు రవీందర్, కుమారస్వామి, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘సర్కార్ సంఘాలను ఓడించాలి’

కాసిపేట: సింగరేణిలో సర్కార్ సంఘాలను ఓడించి కార్మికుల హక్కులకు ఉద్యమించే ఏఐటీయూసీని కార్మికులు భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిందిగా ఏఐటీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపెల్లి వెంకటస్వామి కోరారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ 44కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా చేసి, కార్మికులను మోసం చేసినట్లు ఆరోపించారు. భవిష్యత్తులో సంస్థ మనుగడ కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతో మాత్రమే సాధ్యమవుతాయని, కార్మికులు గమనించి గుర్తింపు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా గనిపై కార్మికులతో కలిసి ఏఐటీయూసీ మేనిఫెస్టో విడుదల చేశారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, నాయకులు కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ పోటీలు



మందమర్రిరూరల్: ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సీఈఆర్ క్లబ్ ఆవరణలో మంగళవారం మహిళలకు దీపాలంకరణ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు, జీఎం సతీమణి సవిత మనోహర్ హాజరై ప్రారంభించారు. అలంకరించిన దీపాలను, వేసిన ముగ్గులను సేవా సమితి సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, మైత్రేయబంధు, ఆసిఫ్, సేవా సమితి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.